ఉష్ణోగ్రత (అంచనా)

19-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	28
తెనాలి	36	27
నరసరావుపేట	36	26
బాపట్ల	35	28
రెంటచింతల	36	27
చీరాల	35	28



రేపల్లె : ప్రకాశం రోడ్డులో డ్రెయినేజీపై నిర్మించిన మెట్లు



చీరాల : దండుబాట రోడ్డులో డ్రెయిన్‌లు ఆక్రమించి నిర్మించిన భవనాలు



బాపట్ల పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురు డ్రెయినేజీని ఆక్రమించి విస్తరించిన దుకాణాలు

డ్రెయినన్నీ మూత

మురుగు పారేదెలా?

రెండు రోజుల క్రితం అర్ధరాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. తెల్లారి లేచి చూసిన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడ్డుగు పెట్టే పరిస్థితి లేనంతగా నీరు, మురుగుతో రోడ్లన్నీ నిండిపోయాయి. పట్టణ మధ్యలోని ప్రాంతాలతో పాటు శివార్లలోనూ ఇదే పరిస్థితి. వర్షపు నీరు పారుదల లేనంతగా కాల్వలన్నీ ఆక్రమించేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. అయినా మున్సిపల్ పాలకుల్లో చలనం లేదు. ఓ మోస్తరు వర్షాలకే రోడ్లన్నీ తటాకాల్లా మారుతున్నా.. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నా.. పరిస్థితి కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కాల్వల్లో చెత్తాచెదారాలను పారిశుధ్య కార్మికులు తొలగించే అవకాశం లేకుండా శ్లాబులతో మూతేస్తున్నా అధికారుల్లో చలనం లేదు. దీంతో అటు కాల్వల ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతుండగా.. ఇటు వానొస్తే వరద అన్నట్లు పట్టణాల్లో పరిస్థితి నెలకొంది.

- ఆక్రమణల్లో సైడు కాల్వలు
- పూడిక తొలగించే పరిస్థితి లేదు
- మురుగు పారక ప్రజల అవస్థలు
- చినుకుపడితే రహదారులన్నీ జలమయం
- ఆక్రమణలపై దృష్టి సారించని పుర పాలకులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

వానొస్తే.. వరద.. వణుకు

వర్షాలు వస్తున్నాయంటే గుంటూరు నగరం, జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు మున్సిపల్ పట్టణాల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన కాల్వలు ఆక్రమణలతో కొన్ని కుదించుకోగా.. మరికొన్ని పూడిక తీసే అవకాశం లేకుండా దుకాణదారులు, ఇళ్ల యజమానులు మూతేశారు. దీంతో డ్రెయిన్లు చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగే అతి కష్టంగా పారుదలవుతుంటుంది. ఈ పరిస్థితుల్లో వర్షపు నీరు పోయే దారి లేక.. డ్రెయిన్లలోని మురుగునీటికి వర్షపు నీరు తోడై రోడ్లపైకి వచ్చేస్తోంది. దీంతో ప్రధాన రహదారులతో పాటు శివారు కాలనీలు వర్షాల సమయంలో తటాకాల్లా మారుతాయి. అపరిశుభ్రత.. దుర్వాసన.. చెత్తా చెదారాలతో ప్రజలు వర్షాలు వస్తున్నా యం టే ప్రజలు ఆం దోళన చెందుతున్నారు.



అద్దంకిలోని నామ్ రోడ్డులో పూడ్చి ఉంచిన సైడ్ డ్రెయిన్లు

(ఆంధ్రజ్యోతి - బాపట్ల నెట్‌వర్క్)

పేరుకు మున్సిపల్ పట్ట ణాలు.. అయినా వర్షాల సమయంలో మురికి కూపాలుగా మారిపోతున్నాయి. ప్రధాన డ్రెయిన్లతో పాటు సైడు కాల్వలు కూడా ఆక్రమణలకు గురవుతు న్నా యి. మ్యాన్ హోల్‌ను ఏర్పాటు చేయకుండా సైడ్ డ్రె యిన్లను శ్లాబు, బండలతో మూతేస్తున్నారు. కాల్వ ల్లో పడుతున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొల గించేందుకు పారిశుధ్య కార్మికులకు పెద్ద తల నొప్పి గా మారింది. కాల్వలపైనే ఏకంగా నిర్మాణాలు చేప డుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరం తా రోడ్లపైకి చేరుతోంది. పలు ప్రాంతాల్లో ము న్సిపల్ అధికారులు కాల్వలపై ఆక్రమణలు పట్టించు కోకపోవడంతో ఇదే అవకాశంగా మిగిలిన వారు కూ డా చెలరేగిపోతున్నారు. కొన్ని పట్టణాల్లో అధికా రు లు నోటీసులు, ప్రచారాలకే పరిమితమవు తున్నా రు. దీంతో వర్షాలు సమయంలో మురుగునీరు రోడ్ల పైకి చేరుతోంది. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవు తున్నాయి. ఆ సమయాల్లో మున్సిపల్ పాలకు లు, అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత కూ డా కాల్వలపై ఆక్రమణలను తొలగించి వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేలా చూసి ముంపు సమ స్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. వర్షాకాలం దగ్గరకు వస్తున్నా పురపాలకులు వరద నీటి కాలువలు, ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీసే పనులు చేపట్టడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

- బాపట్లలో ప్రధాన రహదార్ల వెంబడి డ్రెయినేజీలను దుకాణదారులు ఆక్రమించేశారు. జీబీసీరోడ్డు, రథంబజారు, సూర్యలంకరోడ్లలో, పటేల్‌నగర్, రైలుపేట పరిసర ప్రాంతాల్లోని డ్రెయిన్లలో పూడిక తీసే పరిస్థితి లేదు. మున్సిపల్ అధికారులు ఇప్పటికి రెండుసార్లు డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను తొలిగించినా మళ్లీ నిర్మాణాలు చేపట్టారు.
- రేపల్లెలో డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమైపోతున్నాయి. ప్రకాశంరోడ్డు, పద్మాటాకీస్‌రోడ్డు, బస్టాండ్‌రోడ్డు, నిజాంపట్నంరోడ్డు, లక్ష్మీటాకీస్‌రోడ్డు, ఓల్డుటౌన్‌లో కాల్వలను దుకాణదారులు పూర్తిస్థాయిలో మూతేశారు. ఆయా డ్రెయిన్లలో చెత్తాచెదారాల తొలగింపు మున్సిపల్ కార్మికులకు కష్టతరంగా మారింది. అయినా ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించిన దాఖలాలు లేవు.
- అద్దంకిలోని మున్సిపల్ కార్యాలయంరోడ్డు, బంగ్లా రోడ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో రోడ్ల వెంబడి సైడ్ డ్రెయిన్లను అటు వ్యాపారులు, ఇటు ఇళ్ల యజమానులు ఆక్రమించుకుని శ్లాబులు వేసుకున్నారు. ఆయా డ్రెయిన్లలో ఏళ్లగా పూడిక తొలగించే అవకాశం లేక పూర్తిగా పూడిపోయాయి. నామ్ రోడ్డుకు రెండు వైపులా ఉన్న డ్రెయిన్ల నిర్మాణ సమయంలోనే మూసివేయడంతో ఇటీవల పూడికతీత పనులు చేపట్టేందుకు పలుచోట్ల పగలగొట్టారు.
- చీరాలలో దండుబాటలోని డ్రెయిన్ మూడు కిలోమీటర్ల మేర ఆక్రమ ణ లకు గురైంది. పెద్ద భవనాలు, ఇళ్లు, దుకాణాలు ఏర్పాటు చేశారు. 33 వార్డుల నుంచి వివిధ రూపాల్లో వ్యర్థ జలాలు పారు దల జరిగే ఈ దండుబాట డ్రెయిన్ ఆక్రమణలకు గురికావడంతో ఎక్కడికక్కడే మురుగు పేరుకు పోతోంది.



రేపల్లె : స్టేట్‌బ్యాంకు రోడ్డులో డ్రెయిన్‌లపై ఆక్రమణలు



బాపట్ల రథంబజారులో డ్రెయినేజీని ఆక్రమించి విస్తరించిన దుకాణాలు



చీరాల : దండుబాట రోడ్డులో డ్రెయిన్‌లు ఆక్రమించి నిర్మించిన భవనాలు

ప్రతిపాదించినా.. పట్టించుకోరు

తాగునీటి కేటాయింపులపై తాత్సారం

- 10 టీఎంసీలు కావాలన్నా స్పందించని ప్రభుత్వం
- కేఆర్ఎంబీ అనుమతిస్తేనే సాగర్ నుంచి నీటి విడుదల
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పల్లెల్లో నీటి ఎద్దడి

50 శాతం చెరువుల్లో నిండుకున్న నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువుల్లో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి.. ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి తాగు అవసరాలకు నీటి విడుదల విషయంలో తాత్సారం జరుగుతోందన్న విమర్శలున్నాయి. సాగర్ కుడి కాల్వ పరిధిలోని పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాల్లో చెరువులు నింపేందుకు 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే రోజులు గడు స్తున్నా కేటాయింపులపై నేటికీ నిర్ణయిం తీసు కోలే దు. ఈ నెల మూడో వా రంలో నీటి సరఫరా చేయ నున్నట్లు ముందుగానే జలవనరుల శాఖ ప్రక టించింది. అయితే కేఆర్ఎంబీ నుంచి ఇంతవరకు అనుమతులు రాకపోవడం తో నీటి విడుదల ప్రశ్నా ర్థకంగా మారింది. కుడి కాల్వకు కేటా యింపుల మించి నీటి ని వినియోగించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీ వద్ద వాదిస్తోంది. తాగు అవసరాలకు కూడా నీటి విడుదలకు అనుమతి ఇవ్వొద్దని కేఆర్ఎంబీపై ఆ రాష్ట్ర అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ వాదనను తిప్పి కొడుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించాలని కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమవుతున్నారు. ఈ క్రమంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చకముందే సాగర్ నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

కుడి కాల్వ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన వందలాది చెరువులు సాగర్ జలాలపై ఆధారపడి ఉన్నాయి. దాదాపు 50 శాతం చెరువుల్లో నీటి నిల్వలు నిండుకున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ గణాంకా లు చెబుతున్నా యి. చెరువులకు సత్వరం నీటిని సరఫరా చేయా లని ఆర్‌డబ్ల్యూ ఎస్ శాఖ నుంచి జలవనరుల శాఖకు ప్రతిపాదనలు అందాయి. వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల తదతర మున్సి పాల్టీల్లోని చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం నెలకొన్న తాగు నీటి ఎద్దడిని కేఆర్ఎంబీ దృష్టికి తీసుకువెళ్లి నీటి కేటాయింపులు పొందాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉంది. కనీసం 8 టీఎంసీలు నీటిని సాగర్ నుంచి వినియో గించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతులు ఇవ్వాలన్న వాద నను అధికారులు వినిపిస్తున్నారు. తాగు అవసరాలకు 10 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరుతూ ఉన్నతాధికారుల కు ప్రతిపాదనలు పంపినామని, అయితే ఇంకా అనుమతి రాలేదని జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు.



బొల్లాపల్లి : గండిగనుమలలో నీటి కోసం పాట్లు

సాఫీగా.. జేఈఈ అడ్వాన్స్

గుంటూరు(విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఐఐటీ కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరం, నరసరావుపేట పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ బేస్ట్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 9 నుంచి 12 వరకు సాయంత్రం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులను పరీక్షకు గంట ముందు కేంద్రాల్లోకి అనుమతించారు. దాదాపు 6000 మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సమాచారం.

త్రికరణ శుద్ధి..!

- మురుగునీటి శుద్ధిప్లాంట్ పనులు ముందుకు
- జమ్ములపాలెంరోడ్డులో రూ.5.40 కోట్లతో పనులు
- పూర్తయితే..మరో రెండు ప్లాంట్లకు ముందడుగు..
- సాగు భూమికి స్వచ్ఛనీరు పారుదల లక్ష్యం



జమ్ములపాలెం రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్

బాపట్ల, మే18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం త్రికరణ శుద్ధిగా ముందుకు సాగుతోంది. బాపట్ల పట్టణంలో మూడు మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌లు నిర్మించాలని రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ పనులను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. పురపాలక సంఘం పరిధిలో ముందుగా జమ్ములపాలెంరోడ్డులోని డంపింగ్‌యార్డు రోడ్డు వద్ద ఈస్ట్, వెస్ట్ శ్యాంప్ డ్రెయిన్లు, జమ్ములపాలెం నుంచి వచ్చే డ్రెయిన్ కలిసేచోట రూ.5.40 కోట్లతో ప్లాంటు నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు ముందుకు సాగుతున్నాయి. పట్టణంలోని 34 వార్డుల నుంచి మురుగు నీరు వచ్చి ఈస్ట్ శ్యాంప్, వెస్ట్ శ్యాంప్ భీమునిగుంట వాగులో కలుస్తుంది. ఈ నీటితో శివారు ప్రాంత రైతులు వరి, కూరగాయలు, ఆకుకూరలు, పూలతోటలు, అపరాలు సాగు చేస్తుంటారు. పట్టణం నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే వ్యవసాయ అవసరాలకు వినియోగించాలి. కానీ, ప్రస్తుతం మురుగు నీటిని పంటల సాగుకు నేరుగా వాడుతున్నారు. వెస్ట్ శ్యాంప్ డ్రెయిన్ నుంచి రోజు 3 వేల మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే ప్లాంట్ నిర్మించడం పట్ల రైతులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని కోసం ఎకరన్నర భూమిని కూడా కేటాయించారు.

మరో రెండు..

మొదటిగా డంపింగ్ యార్డు దగ్గర నిర్మిస్తున్న ప్లాంట్ పూర్తయిన వెంటనే పంటలకు శుద్ధి జలాలు అందించే అవకాశం ఉంటుంది. మురుగు కాల్వ నుంచి సముద్రానికి వెళ్లే కలుషిత నీరును శుభ్రం చేయడం వల్ల సముద్ర జీవరాశులు నశించిపోకుండా ఉంటాయి. ఈ ప్లాంటు పూర్తయితే.. మూలపాలెం రోడ్డులో మరో ప్లాంట్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. అయితే ఆ ప్రాంతంలో ఒక ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించడానికి ఎకరం భూమి కావాలి. ఇక్కడ అసైన్డ్ భూమి ఉంది కాబట్టి కేటాయించాలని రెవెన్యూ శాఖను స్థానిక మున్సిపల్ అధికారులు కోరారు. అదేవిధంగా మరుప్రోలువారిపాలెం గ్రామ పరిధిలో 5ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 3వ ప్లాంట్ కూడా నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వభూమి ఇక్కడ అందుబాటులో లేదు. భూసేకరణ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది.

ప్రజారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో

మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణ పనులు ప్రజారోగ్యశాఖాధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. మొదటిగా నిర్మిస్తున్న ప్లాంట్ సక్సెస్ అయిన వెంటనే మిగిలిన రెండు ప్లాంట్‌లు కూడా నిర్మించే అవకాశం ఉంది. దీని కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం నిధులు కేటాయించిన వెంటనే అవి కూడా నిర్మాణంలోకి వస్తాయి. ఇదేవిధంగా మిగిలిన పట్టణాల్లో కూడా మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ల నిర్మాణంపై కదలిక వచ్చినట్లు సమాచారం.

నేడు శింగరకొండలో మహాకుంభాభిషేకం

- విధుశేఖరభారతీస్వామిచే ధ్వజస్థంభ పునఃప్రతిష్ఠకు
- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే 18 (ఆంధ్ర జ్యో తి): శింగర కొండ ప్రసన్నాంజ నేయ స్వామి దేవస్థానంలో మహాకుంభాభిషేకం సోమ వారం ఉదయం 9.03 గంటలకు శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో నిర్వహిం చనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు గురువందనం, గణపతి, మండల పూజలు, వేదపారాయణం, సుందరకాండ పారాయణం, శాంతి హవన ములు, మహాపూర్ణాహుతి తదితర పూజలు జరగనున్నాయి. విధుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం 9.03 గంటలకు ధ్వజ యంత్రస్థాపన, జీవధ్వజస్తంభ ప్రతిష్ఠ, విమాన శిఖర కుంభాభిషేకం నిర్వహించనున్నారు. స్వామి వారికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పిస్తారని అధికారులు తెలిపారు. పూజా కార్యక్రమాలకు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తదితరులు హాజరుకానున్నారు.



శింగరకొండకు చేరిన గజరాజు

విద్యుత్ వెలుగుల్లో శింగరకొండ

మహాకుంభాభిషేకం సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆలయం దేదీప్యమానంగా మారింది. భక్తుల కోసం వివిధ సామాజిక సత్రాలలో అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నారు. మహాకుంభాభిషేకం సందర్భంగా అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి ఆలయం వరకు సుమారు 1500 మంది మహిళలు సుమారు 6 కిమీ కలశయాత్ర నిర్వహించనున్నారు.ఈ యాత్రలో ముందుభాగాన నడిచేందుకు కర్ణాటకలోని రాయచూరు నుంచి గజరాజును తెప్పించారు. ఆదివారం వేకువజామున గజరాజు శింగరకొండకు చేరుకుంది.



విద్యుత్ దీపాల వెలుగులో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

నేటి నుంచి నందమూరి కళాపరిషత్ నాటిక పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సహకారంతో నందమూరి తారకరామారావు 102వ జయంతి, ఆయన సినీ రంగంలోకి అడుగుపెట్టి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు భాగంగా సోమవారం నుంచి 21వ తేదీ వరకు నాటిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి కిడ్నాప్ నాటిక, 2వ రోజు యువభేరి థియేటర్స్ హైదరాబాద్ వారి నా శత్రువు నాటిక, రెండో ప్రదర్శనగా సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి హక్కు నాటిక, 3వ ప్రదర్శన మద్దుకూరి ఆర్ట్స్, చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికతో పాటు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ, 2వ ప్రదర్శనగా సౌజన్య కళాస్రవంతి, ఉత్తరాంధ్ర వారి దేవరాగం, మూడో ప్రదర్శనగా భద్రం ఫౌండేషన్, విశాఖపట్నం వారి దొందూ దొందే హాస్యనాటికలు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడిగా జీవీ కుటుంబ సమేతంగా నాటకోత్సవాలు, వజ్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. చుట్టు పక్కల ప్రాంతాల ప్రేక్షకులు హాజరై వీక్షించాలని కోరారు.

పూటి లాగుడు ప్రదర్శనతో పశు పోషకులకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విరామ సమయంలో ఎడ్ల పూటి లాగుడు ప్రదర్శన పోటీలతో పశు పోషకులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం కొల్లూరు మండలం క్రాప వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి పూటి లాగుడు ప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశు పోషకులు ఎంతో ఉత్సాహంగా పోటీలకు తమ ఎడ్ల జతలతో తరలి రావడం సంతోషకరమన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి, సత్కరించారు. కొద్దిసేపు ఎమ్మెల్యే పోటీలను తిలకించారు. జూనియర్ విభాగంలో ఎనిమిది ఎడ్ల జతలు పాల్గొన్నాయి. సోమవారం సీనియర్ విభాగంలో మరో 8 జతలు, 20న నియోజకవర్గ స్థాయి టైరు బండి విభాగంలో ఆరు జతలు పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 25 ఎడ్ల జతలు పాల్గొనగా విజేతలైన ఎడ్ల జత యజమానులకు సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలుతో పాటు మిగిలిన జతలకు కూడా బహుమతులు ఇవ్వనున్నారు. జూనియర్ విభాగంలో రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలుగా బహుమతులున్నాయి. మూడు రోజుల పోటీల్లో ఎడ్ల యజమానులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, పాల సొసైటీ అధ్యక్షుడు సుంకర రామమోహనబాబు, తలశిల రవితేజ, గొట్టిపాటి భానుగంగాధర్ రైతులు పాల్గొన్నారు.

రాజధాని భూ సమీకరణకు రైతుల అంగీకారం

● బలుసుపాడు, కంభంపాడు గ్రామ సభలు ● స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా రాజధానిని నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములు ప్రభుత్వం తీసుకోదని, రైతులు ఇష్టపడి ఇస్తేనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పెదకూరపాడు మండలంలోని బలుసుపాడు, కంభంపాడు గ్రామాల్లో ఆదివారం రైతులతో ల్యాండ్ పూలింగ్ పై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అభివృద్ధే లక్ష్యంగా పనులను పరిగెత్తిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులతో కలసి భూ సమీకరణపై రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. రైతులకు న్యాయం చేసేలా చూ స్తామని భరోసా ఇచ్చారు. భూ సమీకరణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాసు బుక్‌ల జిరాక్స్‌లను అందించిన రైతులను దుశ్శాలువాలతో సత్కరించారు. పొలాలు ఇచ్చిన రైతుల పిల్లలు చదువుకుని ఉంటే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ ఇక్కడా కూడా అమలు చేస్తారని, ఈ ఏడాది కూడా ముందుగానే కౌలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా రైతులు, రైతు నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కుమార్, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరికపూడిశెల పూర్తి చేస్తేనే రాజకీయాలు..

● లేకుంటే జీవితంలో రాజకీయాలు మాట్లాడను ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శపథం



మాచర్లటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల కల వరికపూడిశెలను పూర్తి చేయకుంటే.. తన జీవితంలో రాజకీయాలు మాట్లాడనని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శపథం చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చగా ఉన్న పల్లెల్లో వైసీపీ మూకలు రాజకీయ చిచ్చు రేపుతూ.. శునకానందం పొందుతున్నాయని ధ్వజమెత్తారు. వరికపూడిశెల పూర్తి చేస్తానని చెప్పి.. 15 సంవత్సరాలు రాజకీయ పబ్బం గడుపుకుని.. పుట్టిన గడ్డకు, నియోజకవర్గ ప్రజలకు రామకృష్ణారెడ్డి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన పిన్నెల్లి.. మాటమార్చి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. ఆ పని చిన్న పిల్లలు సైతం చేయగలరని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో వరికపూడిశెల ఫేజ్ - 1, ఫేజ్ - 2 పూర్తి చేసి పల్నాడు ప్రజలకు సాగు, తాగునీరు అందించి దాహార్తిని తీరుస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో శాంతిని నెలకొల్పేందుకు సహనం పాటిస్తున్నానని, అలాగని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తే తానేంటో చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి, ఆయన అనుచరులను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరికలు చేశారు.

డైమండ్ బాబు ఒంటెత్తు పోకడలు విరమించుకోవాలి

◆ వైసీపీ సమన్వయకర్తపై సొంత పార్టీ నేతల నిరసన గళం ◆ బీసీలకు అవమానం..భజనపరులకే పదవులంటూ ఆగ్రహం



డైమండ్ బాబుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న నియోజకవర్గ వైసీపీ నాయకులు

తాడికొండ, మే 18(ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఒంటెత్తు పోకడలు మానుకోవాలని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు విమర్శిస్తు న్నారు. డైమండ్ బాబు చర్యలను నిరసిస్తూ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ పరిరక్షణ కమిటీగా ఏర్పడి గుం టూరులో ఆది వారం సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లా డుతూ డైమండ్ బాబు పార్టీ పదవులను తనకు భజన చేసిన వారికే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. బీసీలకు మండలాధ్యక్ష ఇవ్వమని కోరగా.. బీసీలు మండల అధ్యక్షులుగా పనిచేయగలరా అ ని.. బీసీల ముందే మాట్లాడి అవమానించారని అవేదన వ్యక్తం చేశా రు. నియోజకవర్గం ఇన్‌చార్జిగా డైమండ్ బాబు రాజధాని ప్రాంతంలో ఎన్నో సమస్యలున్నా.. స్పందించలేదని ఆరోపించారు. రాజకీయంగా ఇబ్బందులు పడుడుతున్న వారి తరుపున పోరాడకుండా.. భజన చేసే వారికే పదవులు ఇస్తారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్ష పదవుల్లో ఒకే సామాజికవర్గానికి మూడింటిని కేటాయించడాన్ని తప్పుబట్టారు. సీనియర్లకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిరసన తెలిపారు. జిల్లా నాయకులకు డైమండ్ బాబుపై ఫిర్యాదులు చేసినప్పటికి ఎలాంటి ప్రయోజనం లే దని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పసుపులేటి వెంకట్రావు పద్మావతి, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, తాడికొండ ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, సుమారు 300 మంది నాయకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ రైల్వే గ్రూపు-బీ పరీక్షలు..!

● పరీక్షలతో ఆపరేటింగ్ సిబ్బంది మూకుమ్మడిగా సెలవులోకి
● వాళ్లలో ఎల్‌పీ, ఏఎల్‌పీ, గార్డులు తదితరులు
● వారంలో మూడు రోజులు రద్దవుతున్న ప్యాసింజర్ రైళ్లు

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు జరుగుతోన్న గ్రూపు-బీ పరీక్షలు కారణంగా వారంలో మూడు రోజల పాటు ప్యాసింజర్ రైళ్లను గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల మొదటి వారంలో 3, 4, 5 తేదీల్లో ఎనిమిది రైళ్లను రద్దు చేయగా ఇప్పుడు 17, 18, 19 తేదీల్లో అవే రైళ్లను మళ్లీ రద్దు చేశారు. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే రైళ్లను కొన్ని గంటల ముందు రద్దు చేస్తుండటంతో.. విషయం తెలియక రైల్వేస్టేషన్లకు వచ్చి నిరీక్షించి ఉసూరుమంటూ ప్రయాణికులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెలలో ఇప్పటికే ఆరు రోజుల పాటు రైళ్లను రద్దు చేశారు. ఇంతటితో అయిపోయిందా, ఇంకా రద్దులు ఉన్నాయా అన్న సమాచారం ఎవరికీ తెలియడం లేదు.

రద్దయిన రైళ్లు..

రైల్వేలో గ్రూపు-సీ హోదాలో ఉన్న ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి.. గ్రూ-బీ పోస్టులను భర్తీ చేస్తారు. ఈ పరీక్షల కోసం లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లు, స్టేషన్ మాస్టర్లు, గార్డులు, టిక్కెట్ కలెక్టర్లు, క్లర్కులు, సేఫ్టీ, ఇతర ఇంజనీరింగ్ పోస్టుల్లో పని చేస్తున్న ఉద్యోగులు హాజరవుతున్నారు. దీంతో సిబ్బంది కొరత తలెత్తుతోందని.. రైల్వే శాఖ చెబుతూ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తోంది. వాటిల్లో (57201) విజయవాడ-గుంటూరు, (57203) గుంటూరు - మాచర్ల, (57206) మాచర్ల- నడికుడి, (57205) నడికుడి - మాచర్ల, (57204) మాచర్ల - గుంటూరు, (57202) గుంటూరు - విజయవాడ, (67779) కాచీగూడ - నడికుడి, (67780) నడికుడి - కాచీగూడ రైళ్లు ఉన్నాయి.

కూలీలు, విద్యార్థులకు ఇక్కట్లు

ఈ రైళ్ల రద్దుతో పల్లెల నుంచి పట్టణానికి, పట్టణం నుంచి వేరొక ప్రదేశానికి ఉదయం వెళ్లి పని చేసుకొని వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అలానే విద్యార్థులు, ఆదివారం పోటీ పరీక్షలకు హాజరయ్యే వాళ్లు కూడా అవస్థలు పడుతున్నారు. రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది పరీక్ష రాసుకోవడానికి అనుమతి ఇచ్చేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లకు లేని ఇబ్బంది ప్యాసింజర్ రైళ్లకు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో షిఫ్ట్ ఆపరేటర్ మృతి



మృతుడు రఫీ

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఉప్పలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ రఫీ(45) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. రఫీ, లైన్‌మెన్ రాజశేఖర్ ఇద్దరూ నరసరావుపేట పట్టణ శివారు లోగల వల్లప్ప చెరువు వద్ద విద్యుత్ స్తంభం వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. రఫీ విద్యుత్ స్తంభంపై ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి.. కిందపడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు.

నేటి నుంచి పది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు (విద్య) మే 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9:30 నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు. 4,254 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, 27 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం 9:30 నుండి 12:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 971 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఎండల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఏఎన్‌ఎం సేవలు అందుబాటులో ఉంచినట్లు డీఈఓ వెల్లడించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పటిష్టమైన భద్రత కల్పించినట్లు చెప్పారు.

దేశ రక్షణలో సైనికుల పాత్ర అనిర్వచనీయం

❖ మంత్రి నాదెండ్ల మనోహర్



సైనికుడి విగ్రహానికి పూలతో నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్, రాజకుమారి

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో సైనికుల పాత్ర అనిర్వచనీయమని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఆయన జై జవాన్ కార్యక్రమంలో పాల్గొని, సైనికుని విగ్రహానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. దేశ రక్షణలో వీరోచితంగా పోరాడి స్ఫూర్తిగా నిలిచిన సైనికులకు వీరతిలకం దిద్ది పూలతో అభిషేకం చేశారు. ఐరన్ స్క్రాప్‌తో విగ్రహాన్ని తయారు చేసిన శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. గ్యాలరీలో రూపొందించిన చత్రపతి శివాజీ, భరతమాత విగ్రహాలను ఆవిష్కరించారు. గ్యాలరీలో శిల్పాలను సందర్శించారు.

వేడుకగా బాల ఏసు దేవాలయ వజ్రోత్సవాలు



దేవాలయాన్ని పునఃప్రతిష్ఠించి గ్రామ క్రైస్తవులకు అంకితం చేస్తున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

అచ్చంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో ఉన్న బాల ఏసు దేవాలయం వజ్రోత్సవాలను ఆదివారం రెండవ రోజు వేడుకగా నిర్వహించారు. గ్రామ నిర్మాత శ్రీ అరుళానంద స్వామి తిరునాళ్ల సందర్భంగా 125 వసంతాల మహోత్సవం కూడా జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య రాత్రి పునఃప్రతిష్ఠించి, దేవాలయంలోని స్వరూపాలను ఆశీర్వదించారు. తాళ్ళచెరువు గ్రామ క్రైస్తవులకు అంకితం చేశారు. తాళ్ళచెరువు విచారణ గురువు డాక్టర్ పుట్టి అంతోని రాజు, 50 మంది గురువులు, 70 మందికి పైగా కన్య స్త్రీలతో పాటు పలు గ్రామాల్లోని క్రైస్తవులు ఈ జూబ్లీ వేడుకలకు హాజరయ్యారు.

మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

❖ శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి



రెంటచింతల,మే 18 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టతనిస్తూ.. అతివలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారైందని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం, పాఠశాలలు తెరిచే సరికి తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలకులకు భిన్నంగా.. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి పథకం వర్తింపజేయడం విశేషమన్నారు. రాబోయే రోజుల్లో మూడు సిలిండర్లకు ఒకేసారి నగదు జమ చేయబోతున్నారని చెప్పారు. అలాగే అన్నదాతల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని, త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచి.. పేదల నడ్డి విరగొట్టిందని విమర్శించారు. చంద్రబాబు దూరదృష్టి గల నేత కావడం వల్లనే ఒక్కొక్కటిగా పథకాలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య నేత కొత్త అంజి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి ఎంపికలు

మంగళగిరి సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌లో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు జరిగాయి. 15 మంది మహిళా పవర్ లిఫ్టర్లు, 11 మంది పురుష లిఫ్టర్లను సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ ఎక్విప్డ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు ఎంపిక చేసినట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 నుంచి జూన్ రెండో తేదీ వరకు ఒంగోలులో జరిగే



ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, భాస్కరరావు, బొల్లినేని చంద్రిక, సంయుక్త కార్యదర్శులు ఘట్టమనేని సాయిరేవతి, ఎస్‌డీ మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు.

ఇరుకుటుంబాల ఘర్షణ: ఒకరి మృతి

పమిడిపాడు (నరసరావుపేట రూరల్), మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిపాడు గ్రామానికి చెందిన ఫిరంగుల కోటేశ్వరరావు(40), కోట్ల అంజి ఇద్దరూ ఒకే వీధిలో ఎదురెదురుగా నివాసం ఉంటున్నారు. అంజికి చెందిన గొర్రెల వల్ల కోటేశ్వరరావు ఇంటి పరిసరాలు అపరిశుభ్రం అవుతున్నాయని కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సాయంత్రం ఇదే విషయంలో ఇద్దరికీ ఘర్షణ జరిగింది. అంజి కర్రతో కోటేశ్వరరావు తలపై గట్టిగా కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృ తుడికి భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. సమాచారం అందు కున్న రూరల్ ఎస్ఐ కిషోర్ ఘటనా స్థలానికి చేరుకుని, ప రిశీలించారు. కేసు నమోదు చే సుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ సమాచారం

విజయపురిసౌత్, మే 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

వ్యర్థాలతో పూడుకుపోయిన డ్రెయిన్‌లు

● పారుదల కాని మురుగునీరు
● తాగునీటి పైపులైన్లు కూడా కాలువల్లోనే
● నీరు కలుషితమవుతున్నాయని ప్రజల ఆందోళన

రేపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన డ్రెయిన్‌లు వ్యర్థాలతో నిండిపోయి మురుగునీరు పారుదల కాక దుర్వాసన రావటంతోపాటు దోమలు వృద్ధి చెంది అంటువ్యాధుల బారిన పడుతున్నామని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘంలోని రాజేష్ థియేటర్ వెనుక రోడ్డులో డ్రెయిన్‌లన్నీ వ్యర్థాలు, మట్టితో పూడుకుపోయి మురుగునీరు పారుదల లేదు.

ఓపెన్ థియేటర్ వెనుక రోడ్డు, 5వ వార్డు కమ్యూనిటీ కాలువ ప్రధాన డ్రెయిన్, ఉప్పూడి రోడ్డులోని ప్రధాన డ్రెయిన్, పద్మావతి సెంటర్‌లోని ప్రధాన డ్రెయిన్, నేతాజీనగర్ సమీపంలోని డ్రెయిన్‌లు వ్యర్థాలు, మట్టితో పూడుకుపోయి మురుగునీరు పారుదలయ్యే పరిస్థితి లేదని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవటం లేదని, చిన్నపాటి వర్షం వస్తే రహదారులన్నీ జలమయమై గృహాల్లోకి మురుగునీరు వస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. టెన్నిస్ క్లబ్ రోడ్డులో శింగం బసవపున్నయ్య వీధి సమీపంలో డ్రెయిన్‌లో తాగునీటి పైపులైన్లు ఉండటంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆయా వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పైపులైన్లు ఉండటం వల్ల మురుగునీరు పారుదల కావటం లేదని, మున్సిపల్ అధికారులకు డ్రెయిన్‌లో పైప్‌లైన్‌లను తొలగించాలని కోరినా పట్టించుకోవటం లేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి డ్రెయిన్‌లో పూడికతీతలు తీసి, కాలువలలో ఉన్న తాగునీటి పైపులైన్‌లను తొలగించాలని కోరుతున్నారు.


ఓపెన్ థియేటర్ వెనుక రోడ్డులో వ్యర్థాలతో పూడుకుపోయిన డ్రెయిన్


సింగం బసవపున్నయ్య స్ట్రీట్ వద్ద డ్రెయిన్‌లో తాగునీటి పైపులు ఉండటంతో మురుగునీరు పారుదల కాని దుస్థితి


టెన్నిస్ క్లబ్ రోడ్డులో కాలువలోనే ఉన్న తాగునీటి పైప్‌లైన్లు

టీడీపీలో చేరిన కొత్తనందాయపాలెం సర్పంచ్ వెంకటేశ్వరమ్మ

● అయ్యప్పరెడ్డి ఆధ్వర్యంలో 200 మంది వైసీపీ శ్రేణుల చేరిక

కర్లపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వైసీపీ శ్రేణులు ఆకర్షితులై టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు చూస్తున్నారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని కొత్తనందాయపాలెం వైసీపీ సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ, నాయకులు అయ్యప్పరెడ్డిలు తమ అనుచరులు 200 మందితో ఎమ్మెల్యే నరేంద్రవర్మ సమక్షంలో కర్లపాలెం టీడీపీ కార్యాలయంలో ఆదివారం టీడీపీలో చేరారు. వెంకటేశ్వరమ్మ, అయ్యప్పరెడ్డి దంపతులను ఎమ్మెల్యే నరేంద్రవర్మ పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. ముందుగా అయ్యప్పరెడ్డి ఆధ్వర్యంలో ఆయన అనుచరులు హైదర్‌పేట వద్దకొచ్చి భారీ బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏట్ర వెంకటరెడ్డి తదితరులు పార్టీలో చేరగా టీడీపీ నాయకులు బోజరాజు, ఎంపీటీసీ బాజి, పిట్ల వసంతరెడ్డి, మునిపల్లి చిన్న, పిట్ల వేణుగోపాలరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, మండలంలోని టీడీపీ నాయులు తదితరులు పాల్గొన్నారు.


ఆట్ల వెంకటేశ్వరమ్మ, అయ్యప్పరెడ్డి అనుచరులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

జనసేన బలోపేతానికి విన్నకోట కృషి అభినందనీయం

● ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె
● వాడవాడలా జనసేన జెండా ఆవిష్కరణ

బాపట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి విన్నకోట సురేష్ చేస్తున్న కృషి అభినందనీయమని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో బాపట్లలో వార్డు వార్డుకు జనసేన జెండా కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి గాదె వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీశ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి ముందుగా చీలురోడ్డు సెంటర్‌లో జనసేన జెండా ఆవిష్కరించారు. తదుపరి 14వ వార్డు తవ్వకాల్వ వద్ద, పాతబస్టాండ్, సాల్వేషన్ ఆర్మీ విలియంబూత్ కళాశాల ఎదురు, బాలకృష్ణపురం, మహాత్మాజీపురం ఎస్టీకాలనీ, ఒకటవ వార్డు బేతనీకాలనీ, ఉమ్మారెడ్డి సరోజనీకాలనీలలో మొత్తం 8 చోట్ల జనసేన జెండాలను విన్నకోట సురేష్‌తో కలిసి గాదె వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన ప్రాంతంలో పెద్ద ఎత్తున జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టటం సంతోషదాయకమన్నారు. పార్టీకి విశేష ఆదరణ లభిస్తుందని, బాపట్లలో పట్టు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ మాట్లాడుతూ జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, సీనియర్ నాయకులు విష్ణుమొలకల చంద్రమోహన్, మాడసాని బాలాజి, కారుమూరి అంజనేష్, మాసా కళ్యాణ చక్రవర్తి, మహేష్, ఏసోబు, సాయిబాబు, ధర్మారావు, వినోద్, బండి రామ్మూర్తినాయుడు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 1వవార్డు బేతనీకాలనీ వాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు.


పార్టీశ్రేణులతో కలిసి వార్డులలో జనసేన జెండా ఆవిష్కరిస్తున్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తదితరులు

శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసినట్లు చెప్పారు.


శ్రీ బగళాముఖి అమ్మవారు

నేడు ఉప ఎంపీపీ ఎన్నిక

పిట్టలవానిపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం ఉదయం 11 గంటలకు ఉప ఎంపీపీ ఎన్నిక జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు తెలిపారు. మండలంలోని పిట్టువారిపాలెం ఎంపీటీసీగా విజయం సాధించిన ఖాజీపాలెం గ్రామానికి చెందిన దెందుకూరి సీతారామరాజు ఉప ఎంపీపీగా కొనసాగుతున్న తరుణంలో పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీగా పని చేసిన షేక్ బాజి తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న దెందుకూరి సీతారామరాజు ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో ఉప ఎంపీపీ పదవి ఖాళీగా ఉంది. సోమవారం జరిగే ఉప ఎంపీపీ ఎన్నికకు మండలంలోని ఎంపీటీసీలు, గ్రామసర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

గుంటూరు ఇన్‌చార్జి ఎస్పీగా తుషార్ డూడి

బాపట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఎస్పీ తుషార్‌డూడిని గుంటూరు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా నియమించారు. గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్ వ్యక్తిగత సెలవుపై తమిళనాడులోని స్వగ్రామానికి వెళ్ళారు. వారంరోజులు సెలవు తీసుకున్న ఆయన తిరిగి 25వ తేదీన గుంటూరు రానున్నారు. దీంతో బాపట్ల ఎస్పీకి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండీలైటు మెమోరియల్ ర్యాలీ

బాపట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండీలైటు మెమోరియల్ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ ప్రారంభించారు. డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు క్యాండీల్ లైటు ప్రదర్శన నిర్వహించి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ 1983వ సంవత్సరంలో ఈ కార్యక్రమం ప్రారంభించటం జరిగిందన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మేనెల 3వ ఆదివారం అంతర్జాతీయంగా ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారికి నివాళులు అర్పిస్తూ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌సి కౌన్సిలర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, జిల్లా కేర్ సపోర్టుసెంటర్, గ్రామసిరిసిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి కృపాకటాక్షలు ప్రజలపై మెండుగా ఉండాలి

● రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర

కర్లపాలెం, మే18 (ఆంధ్రజ్యోతి) : శ్రీ పెద్దింటమ్మ అమ్మవారి కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై మెండుగా ఉండాలని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెంలో జరుగుతున్న గ్రామదేవత శ్రీపెద్దింటమ్మ అమ్మవారి కొలుపులు సందర్భంగా ఆదివారం ఆయన పాల్గొని పూజలు నిర్వహించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు.


శ్రీ పెద్దింటమ్మకి పూజలు నిర్వహిస్తున్న తాండ్ర సాంబశివరావు తదితరులు

టీడీపీ నాయకుల మృతికి నివాళి

కర్లపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం టీడీపీ నాయకులు ఖాజామొహిద్దీన్ వాళ్ళ బాబాయ్ ఇమాంఖాన్ అలియాస్ కన్నమ్మ, హైదరాబాద్ వలి వాళ్ళ అమ్మ బషీరూన్ చనిపోవడంతో ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వారి పార్థివదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఖాజామొహిద్దీన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రక్షణ సైన్యం ప్రార్థన మందిరంలో విరామ బైబిల్ పాఠశాల

వేమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రక్షణ ప్రార్థన మందిరంలో ఈ నెల 20 నుంచి 24 వరకు విరామ బైబిల్ పాఠశాల నిర్వహించనున్నట్లు మేజర్ డి.బాబురావు తెలిపారు. ప్రార్థన మందిరంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు బైబిల్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జ్యోతిబాబు, భాగ్యం, పల్లవి, ప్రతిభ, రిషిత, సింధు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేజర్ బాబురావు

శిథిలావస్థకు చేరి గోడౌన్ మూత

● పట్టించుకోని సహకార సంఘం అధికారులు

వేమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : వేమూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని చావలి గ్రామంలో 40 సంవత్సరాల నాడు రైతుల సౌకర్యార్థం నిర్మించిన గోదాము భవనం శిథిలావస్థకు చేరి మూతపడ్డది. గత దశాబ్ద కాలంగా ఇదే దుస్థితి కొనసాగుతోంది. గతంలో సొసైటీ ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు సరఫరా చేసేందుకు దీనిని ఉపయోగించేవారు. ఖాళీగా ఉన్న సమయంలో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు అద్దెకు ఇచ్చేవారు. తద్వారా సంఘానికి కొంతమేర ఆర్థిక లాభం చేకూరేది. చావలి, పెరవలి, పెరవలిపాలెం, కోడిపర్రు, అబ్బనగూడవల్లి, పెనుమర్రు గ్రామాల రైతులకు ఈ గోదాము ఎంతగానో ఉపయోగపడేది. గోదాము నిర్మించిన స్థలంతో పాటుగా మరో 22 సెంట్లు సంఘ పరిధిలో ఉన్నది. సంబంధించిన అధికారులు శిథిలస్థితికి చేరిన గోదామును పునఃనిర్మించేందుకు ఆలోచన చేయడం గాని స్థలాన్ని పరిరక్షించే విషయంలో గాని చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై రైతులు సహకార సంఘం అధికారులు తీరును దుయ్యబడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతాంగానికి దోహదపడే విధంగా నిధుల కేటాయింపుతో గోదాము నిర్మాణం జరపాలని కోరుతున్నారు.


చావలిలో శిథిలావస్థకు చేరిన మూతపడ్డ సహకార సంఘ గోడౌన్

శరవేగంగా సాగుతున్న చప్టా పనులు


భట్టిప్రోలు సమీపంలోని వెల్లటూరు ఛానల్‌పై రూ.11 కోట్ల వ్యయంతో నూతన చప్టా నిర్మాణానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గత నెల 23న శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి చప్టా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. - భట్టిప్రోలు (కొల్లూరు)

ఖాళీస్థలాలలో పెరిగిపోతున్న ముళ్ళచెట్లు, పొదలు

● పాములు, విషకీటకాలతో ప్రజల ఇబ్బందులు


రాజీవ్‌గాంధీకాలనీలో ఇళ్ళ మధ్య ఖాళీ స్థలాలలో పెరిగిన ముళ్ళచెట్లు

బాపట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రతి వార్డులో ఇళ్ళ మధ్య ఖాళీగా ఉన్న స్థలాలలో ముళ్ళచెట్లు, పొదలు పెరిగిపోతున్నాయి. దీనివలన పరిసర ప్రాంత గృహాల వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిపోయిన ముళ్ళచెట్లు, పొదల మధ్య విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఇళ్ళల్లోకి కూడా వస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. మనవార్డు-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా వార్డులలో పర్యటించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు అనేక మంది ఫిర్యాదులు చేశారు. ఖాళీస్థలాలలో ముళ్ళచెట్లు, పొదలు వల్ల వారు పడుతున్న ఇబ్బందులు గురించి వివరించారు. సదరు స్థల యజమానులకు నోటీసులిచ్చి వాటిని తొలిగించేవిధంగా చూడాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అయితే అధికారులు కార్యక్రమం జరిగినంత సేపు వార్డులో పర్యటిస్తూ డ్రైనేజీలు శుభ్రం చేయటం, జంగిల్ క్లియరెన్స్ చేయటం, బ్లీచింగ్ చల్లటం వంటి పనులు చేసి ఆ తర్వాత వార్డుకు రావటంలేదు. దీనివల్ల సమస్యకు పరిష్కారం లభించటంలేదు. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా చెట్లు, పొదల మధ్య ఉన్న పురుగులు, పాములు రోడ్లపైకి రావటం, ఎత్తు తక్కువగా ఉన్న ఇళ్ళల్లోకి వెళ్ళటం వంటివి జరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా పట్టణంలో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్‌లలో స్థలాలు కొని వదిలేశారు. ఏవిధమైన నిర్మాణాలు చేయకుండా ఉన్న ఖాళీ స్థలాలో కూడా ముళ్ళచెట్లు, పొదలు పెరిగిపోయాయి. ఈ ప్రాంతాలలో పందులు స్వైరవిహారం చేయటం పరిపాటిగా మారింది. విషపురుగులకు నిలయాలుగా ఈప్రాంతాలు ఉన్నాయి. వీరికి కూడా నోటీసులిచ్చి ప్రజలు ఇబ్బంది పడకుండా తగుచర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఎంతైనా ఉంది.

నేడు వేమూరులో నియోజకవర్గ స్థాయి మహానాడు

వేమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వేమూరు నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం 4 గంటలకు వేమూరులో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ పురవేదిక వద్ద నిర్వహించే కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మినీ మహానాడును జయప్రదం చేయాలి

కొల్లూరు, భట్టిప్రోలు, మే 18 (ఆంధ్రజ్యోతి) : మినీ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, భట్టిప్రోలులోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబాలు కార్యకర్తలకు ఆదివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలోని కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో భారీ స్థాయిలో మహానాడు జరిపేందుకు పార్టీ అధినేత తలపెట్టారని, అందులో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద నిర్వహిస్తున్న మినీ మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు సలగల రాజేష్‌బాబు పాల్గొంటారని చెప్పారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పంట కాల్వల్లో పూడికతీత పనులకు శ్రీకారం

కొల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : పంట కాల్వల్లో పూడికతీత పనులకు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ శ్రీకారం చుట్టారు. ఆదివారం దోనేపూడి, రావికంపాడు న్యూరౌట్ ఛానల్‌లో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపుడెక్క తదితర వ్యర్థ పదార్థాల తొలగింపు పనులను డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావుతో కలిసి మైనేని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ దగ్గర పడటంతో సాగునీటికి అవరోధంగా మారింది. పంటకాల్వల్లోని వ్యర్థాలను తొలగించి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా కృషి చేస్తున్నట్లు అయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిశెట్టి సత్యకుమార్, గొరికపూడి ప్రసాద్, పెదపూడి నాగరాజు, కోగంటి సాంబశివరావు, గాదె చంటి, బుర్రి జగన్, మున్నంగి విజయ్, యడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


పంట కాల్వ పూడికతీత పనులను ప్రారంభించిన డీసీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, మురళీకృష్ణ

హనుమత్ జయంతి ఉత్సవాలు ప్రారంభం

భట్టిప్రోలు, (కొల్లూరు), మే 18 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ జయంతి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. మండల పరిధిలోని ఐలవరం వేణుగోపాల స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం విఘ్నేశ్వర పూజ, స్వామి వారికి నాగవల్లీ దళార్చన నిర్వహించారు. తొలుత భట్టిప్రోలు మాతా కాన్వెంట్ వారిచే కోలాట ప్రదర్శన, నగర సంకీర్తన నిర్వహించారు. దీపాల సత్యనారాయణ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ, భజన సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో బూరెల అరుణకుమారి, ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. వామనపల్లి కోటేశ్వరరావు, జంజనం హేమశంకరరావు, కొడాలి సుబ్రహ్మణ్యం, కాగితపు యానాదిరావు, కె.వెంకటేశ్వరరావు, బట్టు వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమత్ జయంతి ఉత్సవాలు ప్రారంభంలో కోలాట ప్రదర్శన చేస్తున్న కళాకారిణిలు

వీరాంజనేయస్వామి ఆలయంలో గోపూజ

వేమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆగమశాస్త్ర ప్రకారం గోపూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ఆలపాటి భార్గవ సాయి దంపతులు స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపించి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం పల్లకి ఉత్సవం, స్వామికి అష్టోత్తర సహస్రనామార్చన జరిపి భక్త సమాజాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు ఆలపించారు.


గోపూజలో పాల్గొన్న భక్తులు

తాళ్ళమ్మ తల్లికి వెండి వస్తువులు

నగరం, మే 18 (ఆంధ్రజ్యోతి) : నగరం మండలం ధూళిపూడి శివారు మాన్యంవారిపాలేనికి చెందిన చిరకాల వెంకటరమణ పద్మావతి దంపతులు, కుమారులు అమెరికాలో స్థిరపడ్డారు. సొంత ఊరి గ్రామదేవత అయిన శ్రీతాళ్ళమ్మతల్లికి వెండి కిరీటాన్ని, తీర్థానికి ఉపయోగించే వెండిగిన్నెను ఆదివారం సమర్పించారు. అంతేకాకుండా గుడికి కావలసిన మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు చిరకాల వెంకటరమణ కుటుంబాన్ని అభినందిస్తున్నారు.


ధూళిపూడిలో తాళ్ళమ్మతల్లికి వెండి కిరీటం, వస్తువులను అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

ఘనంగా శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ళ

కర్లపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం ఆదివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద గ్రామస్తుల సహకారంతో 2 వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కల రమణారెడ్డి, కుంచాల సూర్యనారాయణరెడ్డి పెదనాగిరెడ్డి, కావూరి మునలారెడ్డి, మురళిరెడ్డి, నరసారెడ్డి, కుంచాల అయ్యప్పరెడ్డి, అక్కల గోపిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీపోలేరమ్మ తల్లి



సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగవ రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

సిరాజ్-ఉర్-రెహ్మాన్ అరెస్టయ్యారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

ఏం జరిగింది?: విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబటి సత్రానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి అక్కడే ఉగ్రవాద కార్యకలాపాలపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ తర్వాత విదేశీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సంస్థ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను ఆన్‌లైన్‌లో సంపాదించాడు. దీనిపై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందింది. అంతేకాకుండా గతంలో సిరాజ్ సామాజిక మాధ్యమంలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్టులు పెట్టినట్టు గుర్తించారు. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన సయ్యాద్ సమీర్‌తో రహ్మాన్‌కు ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. సమీర్ కూడా ఉగ్రసానుభూతి పరుడిగా మారినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో సమీర్‌ను హైదారాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ పోలీసులతో పాటు, జిల్లా పోలీస్ అధికారులు ఇద్దరినీ పూర్తి స్థాయిలో విచారించారు. ఇద్దరిపైనా ఉగ్రవాద సానుభూతి చర్యలు, పేలుళ్లకు కుట్ర, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కాగా.. సిరాజ్ తండ్రి, సోదరుడు ఏపీ పోలీస్ శాఖలో పని చేస్తున్నారు.

యూట్యూబ్‌లో చూసి..: సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి బాంబుల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘావర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలో బాంబులు ఎలా తయారు చేయాలనే విషయాన్ని యూట్యూబ్‌లో వెతుకులాడినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించారు. ఈ బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అసలు హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

గురితప్పిన ఇస్రో బాణం

(మొదటి పేజీ తరువాయి)

ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రోటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను కూల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ప్రయోగం పూర్తి కాలేదని.. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకొన్న రాకెట్‌కు మూడో దశలో సాంకేతిక సమస్య వచ్చిందని వెల్లడించారు. దీంతో.. సరిహద్దులపై నిఘా కోసం ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత్ చేసిన ప్రయత్నం తాత్కాలికంగా నిలిచిపోయింది.

పీఎస్ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5:59 నిమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడిన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది.



ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు.

60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.

ఆకాశ్ పనితీరు చూడ్డానికి..కలాం ఉంటే బాగుండేది!

» 'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త,ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు



అల్వాల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మన దేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు రామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యత అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కీవ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కీవ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో రక్తపాతానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: భారత్

న్యూఢిల్లీ, మే 18: భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోఎస్) మధ్య ఆదివారం ఎలాంటి చర్చలూ జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఈ నెల 11న ఇరు దేశాలు తీసుకున్న కాల్పుల విరమణ నిర్ణయానికి 'ముగింపు తేదీ ఏమీ లేదు' అని వెల్లడించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ నిర్ణయం ఈ నెల 18తో ముగుస్తుందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో భారత సైన్యం దీనిపై స్పష్టతనిచ్చింది. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్ ప్రతీకార చర్య కాదని.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు చేసిన న్యాయమని భారత సైన్యం స్పష్టం చేసింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు ఎలా ప్రణాళిక రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణ ఇచ్చింది, ఈ ప్రణాళికను ఎలా అమలు చేసింది.. అనే విషయాలు తెలియజేస్తూ 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..' పేరుతో ఆర్మీ ఆదివారం ఓ వీడియోను షేర్ చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. శ్రీయ కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తు



న్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.



ఆలయ రక్షణ కోసం..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతి లాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహూ గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

నా కెరీర్‌లోనే ప్రత్యేకం

- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.

జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.

దేశసత్తా చాటిన వీరజవాన్లు

● తిరంగ ర్యాలీలో ఎమ్మెల్యే కొండయ్య ● పట్టణంలో త్రివర్ణ పతాకాలతో ర్యాలీ



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, డా.మహేంద్రనాథ్

చీరాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సైనికులు వీరోచిత పోరాటం చేసి ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటారని, ఇది ప్రతి భారత పౌరుని విజయమని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పేరాల గోలి సదాశివుడు కల్యాణ మండపం నుంచి ప్రారంభమై గడియార స్తంభం కూడలి మీదుగా ముక్కోణం పార్క్ వరకు తిరంగ ర్యాలీ సాగింది. నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పాక్ ఉగ్రమూకలు దేశవ్యవస్థను దెబ్బతీసే విధంగా దాడులకు యత్నించారన్నారు. అమాయక పర్యాటకులపై విచక్షణ రహితంగా దాడిచేసి హత్య చేశారన్నారు. దీంతో భారత జవానులు పాక్ ఉగ్రవాదుల ఎత్తులను తిప్పికొట్టడమే కాకుండా, వారిని మట్టుబెట్టి వారి స్థావరాలను భారత సైనికులు ధ్వంసం చేశారని ఎమ్మెల్యే వివరించారు. దేశ సమగ్రతను పరిరక్షించడంతో ప్రదాని మోదీ సరైన సమయం లో ప్రణాళికలు రూపొదించ నట్లు చెప్పారు. ఇదిప్రతి భార తీయుని విజయమని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంఎంసీచైర్మన్ జనార్ధనరావు, పెద్దఎత్తున టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు. ప్రజలు పాల్గొన్నారు.



అద్దంకిలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అద్దంకి : ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ఆదివారం సాయంత్రం అద్దంకిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అద్దంకి పట్టణంలోని గాంధీ బొమ్మ కూడలి నుంచి పొట్టి శ్రీరాములు బొమ్మ కూడలి మీదగా అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఉగ్రవాదులపై పోరులో అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కు వారు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, మన్నం త్రిమూర్తులు, చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, గోవాడ శ్రీకాంత్, చేబ్రోలు సుబ్బయ్య, బచ్చల వాసు, వడ్డవల్లి పూర్ణ చంద్రరావు, కరిముల్లా, బీజేపీ నేతలు జాగర్లమూడి యలమంద రావు, పర్చూరు శ్రీనివాసరావు, విరాట్, జనసేన నేత గోరంట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

రాతి మండప నిర్మాణానికి విరాళాలు



కోనేటి వెంకటేశ్వర్లు, కుమారుడు కళ్యాణ్ లకు రసీదు అందజేస్తున్న ఈఓ తిమ్మానాయుడు

అద్దంకి, మే18 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండప నిర్మాణానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణంలోని కొత్తదామావారిపాలేనికి చెందిన టీడీపీ అద్దంకి పట్టణ మాజీ అధ్యక్షుడు కోనేటి వెంకటేశ్వర్లు, కుమారుడు కళ్యాణ్‌లు రూ.3,69,999లు, అద్దంకి మండలంలోని చినకొత్తపల్లికి చెందిన టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ మానం మురళీమోహన్‌దాస్, సరిత దంపతులు రూ.1,01,116లు అందజేశారు. మేదరమెట్లకు చెందిన మద్దాళి సంజీవరావు, మల్లేశ్వరి దంపతులు, కుమారుడు సురేంద్రబాబు, ఇందిరా దేవి దంపతులు రాతి మండపం పడమర ద్వారం ఏర్పాటుకు అవసరమైన నగదును అందజేశారు. అద్దంకి మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ యేజండ్ల నాగరాజు మండపం నిర్మాణానికి రూ.1.18 లక్షలు అందజేశారు. సందిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధరలపై ప్రశ్నిస్తున్న భక్తుడు

ఇష్టారాజ్యంగా పూజాసామగ్రి ధరలు

అద్దంకి : శింగరకొండలో సాధారణ రోజులలోనే పూజాసామగ్రి ధరలు అంటే భక్తులు బెంబేలెత్తె పరిస్థితి ఉంది. మహాకుంభాభిషేకం సందర్భంగా దుకాణాల నిర్వాహకులు ధరలు రెట్టింపు చేశారు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాదనలకు దిగుతున్నారు. అయితే వ్యాపారులు కూడా తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తూ భక్తులను ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. దేవస్థానం అధికారులు మహాకుంభాభిషేకము ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడంతో పూజా సామగ్రి ధరల నియంత్రణపై అజమాయిషీ లేకుండా పోయింది. సోమవారం ధరలు మరింత పెంచి అమ్మడం ఖాయంగా కనిపిస్తుంది. అధికారులు స్పందించి ధరలను నియం త్రించే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

స్వర్ణమ్మ తిరునాళ్లకు సర్వం సిద్ధం



ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మ

స్వర్ణ (పర్చూరు), మే 18 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం, స్వర్ణ గ్రామంలో వేంచేసిన స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. నేటి నుండి రెండు రోజుల పాటు తిరునాళ్ల నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గ్రామాన్ని వరదలు ముంచెత్తే సమయంలో తన చీర కొంగును అడ్డుపెట్టి గ్రామాన్ని కాపాడిందని భక్తుల విశ్వాసం. మూడు రోజుల పాటు తిరునాళ్ల వేడుకలను నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా 32వ వార్షిక తిరునాళ్లలో భాగంగా సోమవారం నుంచి తిరునాళ్ల ప్రారంభం కానుంది. మొదటి రోజు అమ్మవారికి పసుపు కుంకుమలు భక్తులు సమర్పిస్తారు. ప్రతి ఇంటి నుండి ఆడపడు చుకు పసుపు కుంకుమ తీసుకురావడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఆడపడుచు ఎక్కడ ఉన్నా ఏటా అమ్మవారి తిరునాళ్లకు విధిగా రావడం గ్రామ సాంప్రదాయంగా మారింది. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిగినా అమ్మవారికి తొలి శుభలేఖను అందజేయటం మరో విశేషం. ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీలోని ద్వారకపాడు గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మతల్లి 3వ కొలుపులు మహోత్సవం ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటి వద్ద పొంగళ్లు పెట్టుకొని, తర్వాత ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. అదేవిధంగా తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలో అన్నదానం నిర్వహించారు.





స్వర్ణమ్మ దేవాలయం, వలపర్లలో పోలేరమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

తిరుమలకు బయలుదేరిన కూరగాయల లారీ



తిరుమలకు బయలుదేరిన కూరగాయల లారీ

మార్టూరు, మే18(ఆంధ్రజ్యోతి):కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరునిస్వామి నివాసం తిరుమలలోని అన్నదానసత్రానికి ఆదివారం మార్టూరు నుంచి లక్షన్నర రూపాయల విలువైన కూరగాయలను లారీలో పంపించారు. బండారుపల్లి హరిబాబు కుటుంబసభ్యులు దాతృత్వంతో భక్తులు కూరగాయలను కొనుగోలు చేసి తిరుపతి తిరుమల దేవస్థానం నుండి వచ్చిన లారీలో కూరగాయలను పంపించారు. ఈ సందర్భంగా మార్టూరులో తూర్పుబజారున వినాయకుని గుడి వద్ద కూరగాయల లారీ వద్ద దాత హరిబాబు జండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, కంభంపాటి శ్రీనివాసరావు, దివ్వె ప్రసాద్, తేల్రపోలు శ్రీనివాసరావు, కమ్మ శివనాగేశ్వరరావు తదితరులు వినాయకుని గుడిలో స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు కూరగాయల లారీ వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం అక్కడ నుంచి కూరగాయల లారీ బడ్డురాయి సెంటరు,గన్నవరం రోడ్డు మీదగా ర్యాలీగా పెద్దఖానా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా కోలాటం ప్రదర్శించారు. అంతేగాకుండా లారీ ముందు మహిళలు కోలాటం ప్రదర్శిస్తుండగా భక్తులు ఉత్సాహంగా లారీ వెంట నడచారు. పెద్దఖానా వద్ద పలువురు మహిళలు కూరగాయల లారీవద్ద హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామి వారి లడ్డూ ప్రసాదంగా పంపిణీ చేశారు.ఇంకా పులిహార, మజ్జిగ ప్యాకెట్లును భక్తులకు పంపిణీ చేశారు.అనంతరం తిరుమలకు బయలుదేరిన లారీకి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

భారీగా తరలి వచ్చిన ప్రజలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చెరుకూరు (పర్చూరు), మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరుకూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల నుండి పెద్దఎత్తున కంటి సమస్య ఉన్నవారు వైద్యశిబిరానికి హాజరుకావడంతో ఆ ప్రాంగణం కిక్కిరిసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీడీపీ శ్రేణులు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. వేసవి నేపథ్యంలో ప్రత్యేకంగా షామియానాలు ఏర్పాటు చేసి పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా వైద్య పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తొలుత దివంగత నందమూరి తారక రామారావు, విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు షేక్. షంషుద్దీన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఉషారాణి, కారుమంచి కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు షేక్. జమాలుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, మానం హరిబాబు, పాలేటి కోటేశ్వరరావు, దాసరి రామకృష్ణ, ఫ్యాక్టరీ శ్రీను, ఆకుల శ్రీనివాసరవు, నరేంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

553 మంది రోగులు హాజరు

ఉచిత మెగా వైద్యశిబిరానికి వివిధ గ్రామాల నుండి 553 మంది రోగులు హాజరుకాగా, వారికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 158 మందికి శస్త్రచికిత్సలు అవ సరం అని నిర్ధారించారు. వేసవి తాపం తట్టుకునే విధంగా రోగులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను కూడా అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం భోజన ఏర్పాటు చేశారు.

రాజకీయాలకు అతీతంగా సేవాకార్యక్రమాలు

సామాజిక సేవే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియోజకవర్గ ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని పలువురు టీడీపీ నాయకులు కొనియాడారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన పర్చూరు నియోజక వర్గంలో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్య భద్రతనిస్తూ ప్రతినిత్యం అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

కమ్యూనిటీ కిచెన్ సేవలు ప్రశంసనీయం



సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి చిలుకూరి శ్రీధర్

పంగులూరు,మే 18 (ఆంధ్రజ్యోతి): పంగులూరులో కమ్యునిటీ కిచెన్ సెంటర్ ఏర్పాటు చేసి వృద్ధులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని కాకతీయ ఫౌండేషన్ డొనేషన్స్ క్లబ్‌చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో ఆదివారం పంగులూరు కాకతీయ ఫౌండేషన్ తొలివార్షికోత్సవం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు చిలుకూరి శ్రీధర్, బాచిన శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పాటిబండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాకతీయ ఫౌండేషన్ పేద విద్యార్థుల చదువుకు అందిస్తున్న సేవలను వివరించారు. పంగులూరులో ఆసరా లేని వృద్ధులకు నిత్యం పౌష్టికాహారం అందిస్తున్న కమ్యునిటీ కిచెన్ నిర్వహణలో పంగులూరు కాకతీయ ఫౌండేషన్‌కు ఆర్థిక సహకారం అందించాలని శ్రీధర్, శ్రీనివాస్ కోరారు. కమ్యునిటీ కిచెన్ సెంటర్ నిర్వహణలో సేవలందిస్తున్న మహిళలను అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు కమ్మ సంఘ ప్రతినిధులు మండవ సుబ్బారావు, నండూరి శ్రీరాములు, అంగకుర్తి నరసింహం, కాకతీయ విద్యా ట్రస్ట్ కోశాధికారి వెంకయ్యచౌదరి, విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు, విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, ప్రిన్సిపాల్ దొప్పలపూడి శ్రీనివాసరావు, రోటరీక్లబ్ ప్రతినిధి వీరరాఘవయ్య, మేడ సుబ్బారావు, బాచిన చౌదరిబాబు, బాచిన రత్నకుమారి, పరిటాల దేవి, పలువురు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్యకు అభినందనలు



సీతారామయ్యను అభినందిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఒంగోలు, కార్పొరేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామయ్య వైద్యరంగంలో అనేక సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని, అలాగే పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులు కావడం మరింత ఆనందంగా ఉందని చెప్పారు. సీతారామయ్య భవిష్యత్‌లో మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్‌లు బీఎస్ సీతారామయ్య, జాలాది మణిబాబు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రావిపాటి జయశేఖర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

సీతారామయ్యను కలిసిన టీడీపీ నాయకులు

నాగులుప్పలపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన కామేపల్లి సీతారామయ్యను బినిడమానూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఒంగోలులో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు పైడి నాగేశ్వరరావు, మోషే, సౌలు, బాబురావు,వెంకట్రావు తదితరలు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు సహకరించాలి

ఒంగోలు విద్య, మే 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రస్తుత ప్రభుత్వానికి అందరూ సహకరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున మోడల్ ప్రైమరీ స్కూళ్లను వారు స్వాగతించారు. 59 మంది పిల్లలకు నాలుగు, 60 మందికిపైన ఐదు పోస్టులు ఇస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైస్కూళ్ల నుంచి 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొచ్చే క్రమంలో మిగులుగా తేలుతున్న స్కూలు అసిస్టెంట్లను ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించడానికి చేస్తున్న ప్రయత్నాలను వారు వివరించారు. విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనేందుకు వీలుగా ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషుతో పాటు తెలుగు మీడియాన్ని కొనసాగించాలని కోరారు.

1న అంబేడ్కర్ యువజన సంఘం మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో వచ్చేనెల 1వ తేదీన అంబేద్కర్ యువజన సంఘం ప్రథమమహాసభ జరుగుతుందని ఐపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని మూడు బొమ్మల వద్ద ఆదివారం మహాసభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో దాసరి సంగీతరావు, నాగేశ్వరరావు, రమేష్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, అంకన్న సుబ్బారావు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్

సింగరాయకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి) : భారత్-పాకిస్తాన్ యుద్ధ వాతావరణ నేపథ్యంతో తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామాయపట్నం మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్ సూచించారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని చెల్లమ్మగారి పట్టపుపాలెంలో శనివారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. గ్రామంలోని కాపులు, ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తూ ఉండాలని తెలిపారు. అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తూ ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1093, రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అవీ..ఇవీ..

పిడుగుపాటుకు గేదె మృతి

● ఒకే ప్రాంతంలో రెండో ఘటనతో ప్రజలు భయాందోళన

కొత్తపాలెం(చీరాల), మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపాలెంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగుపడి గేదె మృతిచెందింది. అర్ధరాత్రి సమయం నుంచే చాలా సేపు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఆ సమయంలోనే పాటుతో అక్కల జాలమ్మకు చెందిన గేదె మృతి చెందినట్లు యజమాని చెబుతున్నాడు. దీనిపై అధికారులు ఇప్పటికే వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే సమీపంలోనే ఇటీవల పడిన పిడుగు కారణంగా రెండు ఎడ్లు మృత్యువాత పడిన సంగతి విదితమే. అందుకు ప్రభుత్వం నుండి సాయం కూడా అందింది. అయితే వరుస ఘటనలతో గ్రామ ప్రజలు కొంత భీతిల్లుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అద్దంకి, మే18(ఆంధ్రజ్యోతి): అద్దంకి డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలుసుకొని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపోమేనేజర్ బెల్లం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 9959225697 సెల్‌నంబరుకు ఫోన్ చేసి తెలియచేయాలని కోరారు.

వీడని మిస్టరీగా యువకుని మృతదేహం

పర్చూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో గుర్తు తెలియని యువకుని మృతి మిస్టరీగా మారింది. మృతిచెందిన యువకుడు ఎవరనే విషయం తెలియకపోవడంతో మృతదేహన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలోనే ఉంచారు. అయితే మృతదేహం పడిఉన్న తీరు, మృతుని వయస్సు తదితర అంశాలను పరిశీలించి యువకుడు ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తిగా ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల ప్రయాణీకులు ప్రజలతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ తోపాటు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండే ప్రాంతంలో ఇలా గుర్తుతెలియని మృతదేహం లభించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే పోలీసు మాత్రం యాచకుడై ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. ఏది ఏమైన పూర్తిస్థాయి విచారణ చేపడితే తప్ప మృతదేహం ఎవరిది, మృతికి గల కారణాలు ఏమిటి అన్న విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొని వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ మస్తాన్‌వలి

అద్దంకి, మే 18 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో శింగరకొండ రోడ్డులోని ద్వారకానగర్ సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్నాయి. దీంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ద్వారకానగర్ సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇందిరాగనర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలులోని వైద్యశాలకు తరలించారు.

దివ్యాంగుల విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్



ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్ చేపడుతున్న భవిత కేంద్రం సిబ్బంది

బల్లికురవ, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో మూడేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని బల్లికురవ మండల భవితకేంద్రం ఐఈఆర్‌టీలు నాగబాబు, నాజీనిలు తెలిపారు. ఆదివారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రంలో చేర్చుకోనేందుకు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులు ఎవరు ఉన్నా, వెంటనే భవిత కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. భవితకేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ కూడా చేయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం భవిత కేంద్రంలో విద్యార్థులు ఎక్కువ మంది చేరేలా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేయిస్తోందన్నారు.

రాజస్థాన్ కార్మికుడి మృతిపై కేసు

చీమకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు ఆదివారం మృతి చెందాడని సీఐ సుబ్బారావు చెప్పారు. స్వరూప్‌రావు(34) అనే కార్మికుడు డ్యూటీ ముగించుకున్న తదుపరి తన గదికి వచ్చి నిద్రపోయాడని, అదే రూంలో ఉంటున్న మరో కార్మికుడు కొంత సేపటి తర్వాత స్వరూప్‌రావును నిద్రలేపగా లేవకపోవటంతో తోటి కార్మికులకు విషయాన్ని తెలిపాడు. వారు వచ్చి చూసి మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి

ఆంధ్రజ్యోతితో సీఐ సూరేపల్లి సుబ్బారావు ముఖాముఖి



సీఐ సుబ్బారావు

చీరాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో రౌడీమూకల వ్యవహార శైలి ఇబ్బందికరంగా మారింది. ఈక్రమంలో నేరాలను నియత్రించేందుకు పోలీసుశాఖ అప్రమత్తమవతోంది. 'ఆంధ్రజ్యోతి'తో వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు పలు వివరాలు పంచుకున్నారు.

ప్ర : పట్టణంలో రౌడీషీటర్ల కట్టడికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జ : ఇటీవలే బదిలీపై వచ్చినప్పటికీ, ఇక్కడ పరిస్థితులపై క్షుణ్ణంగా తెలుసుకున్నాను. నేర నియంత్రణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రౌడీషీటర్ల కట్టడిపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సూచనలు ఉన్నాయి. దీంతో నేరగాళ్లపై ముందస్తు నిఘా ఉంచాం.

ప్ర : ఇప్పటి వరకు ఏమైనా కౌన్సెలింగ్ ఇచ్చారా..?

జ : తాజాగా ఓ కేసుకు సంబంధించి విచారణలో భాగంగా పిలిపించాము. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించాము. భిన్నంగా వ్యవహరిస్తే పీడీ యాక్టులు నమోదు చేస్తాము.

ప్ర : ఇటీవల చోరీలు అధికమయ్యాయి. చర్యలు ఏమైనా ఉన్నాయా ?

జ : ఇటీవల ఓఇంట్లో భారీ మొత్తంలో జరిగిన చోరీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గంటల వ్యవధిలో ఛేదించాము. అలాగే అంతర్గత వీధుల్లో సీసీ కెమెరాలకు సూచనలు చేస్తున్నాము. యజమానులు కూడా జాగ్రత్తలు పాటించాలి.

ప్ర : పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై చర్యలు ఉన్నాయా ?

జ : పట్టణంలో వాహన రద్దీ అధికంగా ఉంది. కొందరు దుకాణదారుల్లో కూడా నిర్లక్ష్యం ఉంది. రెండురోజుల్లో కచ్చితమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తాము. అందుకు ప్రజల సహకారం ఉండాలి.

ప్ర : స్టేషన్‌లో సేవలు పారదర్శకంగా అందిస్తున్నారా ?

జ : బాధితులకు ఒక విషయం స్పష్టం చేస్తునాము. శాంతిభద్రత సమస్యలు ఎదురయినప్పుడు నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. దళారు వ్యవస్థ స్టేషన్లలో లేదు. సామాన్యులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాము. నేరుగా వచ్చి పరిష్కారం పొందవచ్చు.